# నవతరం

సామాజిక, రాజకీయ తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | పేజీలు : 04 | సంచిక :185 | వెల : 01/- | 05 ఆదివారం జులై 2026

ఎడిషన్ ఇన్ ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి



**PUBLIC NOTICE**

My Original SSC Passed Certificate has been lost. The particulars are as follows:Name: B. Sai KrishnaFather's Name: Late Basuru Varada RajuluIf anybody finds the above certificate, kindly return it to the undersigned or contact me at the number given below. I also request the concerned authorities to treat this publication as intimation of loss and kindly issue a Duplicate SSC Passed Certificate.Contact: +91 9603892158Sd/-B. Sai Krishna


# ఒక గురువు-వేల జీవితాలు

- ట్యూషన్‌తో మొదలైన విద్యా యజ్ఞం
- లక్ష్మీ భారతి కాన్వెంట్‌కు రూపకర్త
- వేలాది విద్యార్థుల విజయాలకు పునాది
- విద్యతో పాటు విలువలకు పెద్దపీట
- క్రమశిక్షణకు మారుపేరు
- ధర్మం, దేశభక్తికి అంకిత జీవితం
- ఆలయాభివృద్ధికి ఉదార సహకారం
- శిష్యులే నిజమైన సంపదగా భావించిన గురువు
- నాలుగు దశాబ్దాల విద్యా సేవ
- చిరస్మరణీయంగా నిలిచిన జీవితం



## రామరాజులంక నుంచి అంబాజీపేట వరకు విద్యా వెలుగులు నింపిన పి.ఎల్. జనార్దన్ రెడ్డి ఇక లేరు

**నవతరం ప్రతినిధి మహిపాల నాగరాజు**

ఒక చిన్న ట్యూషన్‌తో మొదలైన ప్రయాణంఢ నాలుగు దశాబ్దాల్లో వేలాది మంది విద్యార్థుల జీవితాలను వెలిగించిన మహా విద్యా ఉద్యమంగా మారింది. విద్యను ఉపాధిగా కాకుండా సమాజానికి సేవగా భావించిన పి.ఎల్. జనార్దన్ రెడ్డి, అంబాజీపేట ప్రాంతంలో ఒక విద్యాసంస్థను మాత్రమే కాదు, తరతరాల భవిష్యత్తును నిర్మించారు. ఆయన మరణంతో ఒక వ్యక్తిని కాదుఢ ఒక విద్యా యుగాన్నే కోల్పోయామని శిష్యులు, ప్రజలు భావిస్తున్నారు. రామరాజులంకలో 1956 అక్టోబర్ 2న పెచ్చెట్టి రెడ్డి, గౌరమ్మ దంపతులకు ఎనిమిది మంది సంతానంలో చివరి బిడ్డగా జన్మించిన పి.ఎల్. జనార్దన్ రెడ్డి, చిన్ననాటి నుంచే గురుకుల విద్యలో పెరిగారు. అక్కడ అలవడిన క్రమశిక్షణ, సంస్కారం, సేవాభావం ఆయన జీవితానికి బలమైన పునాదిగా నిలిచాయి. మలికిపురం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత వ్యక్తిగత ఉద్యోగ జీవితాన్ని కాకుండా, విద్య ద్వారా సమాజాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నారు. అంబాజీపేట మండలం మాచవరంలో కొద్దిమంది విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడం ద్వారా ప్రారంభమైన ఆయన విద్యా ప్రస్థానం, క్రమంగా "భారతి ట్యుటోరియల్స్"గా ఎదిగింది. ఆ చిన్న ప్రయత్నమే 1978లో అంబాజీపేటలో లక్ష్మీ భారతి కాన్వెంట్ స్థాపనకు దారితీసింది. చిన్న స్థాయిలో మొదలైన ఆ పాఠశాల, ఆయన పట్టుదల, కృషి, నాణ్యమైన బోధనతో ప్రాంతంలోనే అత్యంత విశ్వసనీయ విద్యాసంస్థగా ఎదిగింది. 1988లో మొదటి పదో తరగతి బ్యాచ్ ప్రారంభమవడం కాన్వెంట్ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది మెరుగైన ఫలితాలతో ఆ విద్యాసంస్థ తన ప్రత్యేకతను చాటుకుంది. నేడు వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు, విదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న అనేక మంది ఒకప్పుడు జనార్దన్ రెడ్డి వద్ద చదువుకున్న విద్యార్థులే. ఆయనకు విద్య అంటే పాఠ్యపుస్తకాలు మాత్రమే కాదు. క్రమశిక్షణ, బాధ్యత, నిజాయితీ, దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం వంటి జీవన విలువలను ప్రతి విద్యార్థిలో నాటేందుకు కృషి చేశారు. అందుకే ఆయన వద్ద చదివిన వారు ఆయనను ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా జీవిత మార్గదర్శిగా గుర్తుంచుకుంటున్నారు. విద్యతో పాటు ధర్మసేవలోనూ ఆయన ముందుండేవారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా దేశభక్తి భావాలను ప్రోత్సహించడంతో పాటు, రామభక్తుడిగా అయోధ్య యాత్రలు చేశారు. స్థానిక దేవాలయాల అభివృద్ధికి విరాళాలు అందిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తించారు. "గుడి బాగుంటే ఊరు బాగుంటుందిఢ బడి బాగుంటే భవిష్యత్తు బాగుంటుంది" అనే ఆయన నమ్మకాన్ని జీవితాంతం ఆచరించారు. సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నా, తన శిష్యుల విజయాలనే గొప్ప గౌరవంగా భావించేవారు. "నేను జనార్దన్ రెడ్డి మాస్టారి విద్యార్థిని" అని గర్వంగా చెప్పుకునే వేలాది మంది శిష్యులే ఆయన జీవితానికి నిజమైన సార్థకత. ఈ ప్రయాణంలో భారతి అండగా నిలవగా, కుమార్తెలు దుర్గ, జ్యోతి, కుమారులు పవన్ కుమార్ రెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులకే కాదు, లక్ష్మీ భారతి కాన్వెంట్‌లో చదివిన ప్రతి విద్యార్థికి ఆయన ఒక తండ్రి, గురువు, మార్గదర్శి. పి.ఎల్. జనార్దన్ రెడ్డి ఇక భౌతికంగా లేకపోయినా, ఆయన నిర్మించిన విద్యాసంస్థ, ఆయన బోధించిన విలువలు, ఆయన తీర్చిదిద్దిన వేలాది మంది శిష్యులు ఉన్నంతకాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. గురువు మరణించడుఢ ఆయన వెలిగించిన జ్ఞానదీపమే తరతరాలకు మార్గం చూపుతూనే ఉంటుంది.







# మోసానికి మొనగాడు

**ఒక వెస్ట్రన్ యాక్షన్ అడ్వెంచర్ కథ**

**రచన : తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా**




రాయలసీమ సరిహద్దుల్లోని నల్లకొండ ఎడారిలో శతాబ్దాల క్రితం ఒక రాజవంశం దాచిపెట్టిన అపారమైన బంగారు నిధి ఉందనే కథ తరతరాలుగా ప్రచారంలో ఉంది. అయితే ఆ నిధిని చేరుకోవడం అంత సులభం కాదు. దానికి నాలుగు రాగి తాళాలు కావాలి. ఆ నాలుగు తాళాలు నలుగురు వ్యక్తుల చేతుల్లో విడివిడిగా ఉన్నాయి. అదే సమయంలో బంగారం కోసం ఏ హద్దులకైనా వెళ్లే క్రూరుడైన భైరవసింగ్ ఆ తాళాలను సంపాదించడానికి రక్తపాతం సృష్టిస్తుంటాడు. మరోవైపు చిన్నపాటి దొంగగా పేరు తెచ్చుకున్న వీరన్న మాత్రం దొంగలను దోచి, మోసగాళ్లను మోసం చేసి పేదలకు సాయం చేసే వ్యక్తి. వీరన్న ప్రయాణంలో అతనికి ఎదురవుతుంది మాధవి. గుర్రపు స్వారీ, తుపాకీ గురి, కత్తిసాములో దిట్టైన ఆమె తండ్రి కూడా ఒక తాళానికి కాపలాదారు. భైరవసింగ్ చేతిలో తన కుటుంబం నష్టపోవడంతో నిధి వెనుక ఉన్న అసలు రహస్యాన్ని తెలుసుకోవడానికి ఆమె కూడా రంగంలోకి దిగుతుంది. ఈ నిధి వేటలో మోసం మీద మోసం, నమ్మకం మీద అనుమానం, ప్రాణాలకు తెగించిన పోరాటాలు, గుర్రాలపై ఉరుకులు, ఎడారిలో వెంటాడింపులు, తెలివైన ఎత్తుగడలు వరుసగా జరుగుతాయి. చివరికి అసలు తాళం ఎవరి దగ్గర ఉంది? నిజమైన మోసగాడు ఎవరు? బంగారం ఎవరికి దక్కుతుంది? లేక ఆశే అందరినీ నాశనం చేస్తుందా?

**ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఉత్కంఠభరితమైన వెస్ట్రన్ యాక్షన్ కథే "మోసానికి మొనగాడు".**

**-ప్రత్యేక ఆకర్షణలు**

- గుర్రాలపై ఉత్కంఠభరితమైన ఛేజ్ సన్నివేశాలు
- నిధి వేటలో మోసాలు, మలుపులు
- యాక్షన్, కామెడీ, భావోద్వేగాల సమ్మేళనం
- ప్రతి అధ్యాయంలో ఉత్కంఠను పెంచే ట్విస్టులు
- చివరి వరకు ఆసక్తిని నిలబెట్టే క్లైమాక్స్

**-రచయిత**

**తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా**

**"కలం చేతిలో ఉంటే... కథకు హద్దులు ఉండవు."**

# ఇంటి ఓటును కాపాడండి-యువతే బాధ్యత తీసుకోవాలి

**నవతరం పలాస,**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు. ఓటరు జాబితా ఖచ్చితంగా, పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను చేపట్టింది. ఈ లక్ష్యం అభినందనీయమే అయినప్పటికీ, అర్హులైన ఓటర్లకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు, రోజువారీ కూలీలు, గ్రామీణ మహిళలు ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రతి ఇంటి ఓటును కాపాడే బాధ్యత యువతపై ఉందని దువ్వాడ శ్రీధర్ అన్నారు. శుక్రవారం పలాసలో ఆయన నివాసం వద్ద మాట్లాడుతూ, వైయస్సార్సీపి సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) ప్రక్రియపై పలు కీలక సూచనలు చేశారు. యువత ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు, తాతలు, అవ్వలు, నిరక్షరాస్యులకు సహాయపడాలని పిలుపునిచ్చారు. ఇంట్లో నాలుగు లేదా ఐదు ఓట్లు ఉంటే ఒక్క ఓటు కూడా అనవసర కారణాలతో పోకుండా చూసుకోవాలని సూచించారు. పత్రాలు సేకరించడం, ఫారాలు సరిగా నింపించడం, గడువులోగా సమర్పించడం, అవసరమైతే దీూను సంప్రదించడం వంటి బాధ్యతలను యువత స్వయంగా తీసుకోవాలన్నారు. ఒక్క ఓటు విలువ ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుందని గుర్తుచేశారు.



**ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఇబ్బందులు వద్దు.. ఆధార్, లకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**డబుల్ ఎంట్రీలు తొలగించాలి.. కానీ నిజమైన ఓటరును వేధించొద్దు: దువ్వాడ శ్రీధర్**

### వివాహిత మహిళల సమస్యపై ఆవేదన

అందించిన ఫారాల్లో ఇప్పటికే ప్రస్తుత ఓటరు వివరాలు ముద్రించి ఉన్నాయని, అంటే వారు ఇప్పటికే ఎన్నికల సంఘం రికార్డుల్లో నమోదైన ఓటర్లని వివరించారు. భర్తకు 2002 ఓటరు జాబితాలో పేరు ఉండి, భార్య గత 20 నుండి 25 సంవత్సరాలుగా అదే భర్తతో, అదే చిరునామాలో ఓటరుగా నమోదై ఉంటే, ఆమెను మళ్లీ తల్లిదండ్రుల 2002 వివరాలు లేదా దశాబ్దాల క్రితం పత్రాలు అడగడం ఆచరణ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. భారతీయ కుటుంబ వ్యవస్థలో వివాహం తర్వాత భార్య భర్త కుటుంబంలో సభ్యురాలిగా జీవిస్తుందని, భర్త 2002 రికార్డు ఉంటే భార్యకు దానినే ప్రాథమిక ఆధారంగా పరిగణించే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ విధానం వల్ల వివాహిత మహిళలు, వృద్ధులు, గ్రామీణ ప్రజలు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 20 నుండి 30 సంవత్సరాల క్రితం పత్రాలు సేకరించడం చాలా మందికి కష్ట సాధ్యమవుతోందని, కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వస్తోందని చెప్పారు.

### ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి ?

ఆధార్ కార్డు, కార్డులను ప్రభుత్వమే ప్రధాన గుర్తింపు పత్రాలుగా గుర్తించిందని, ఇవన్నీ ఉన్నప్పటికీ దశాబ్దాల క్రితం పత్రాలను మళ్లీ వెతకాల్సిన పరిస్థితి ప్రజలపై అదనపు భారం అని అన్నారు. పలాస నియోజకవర్గంలో సుమారు 2.24 లక్షల ఓటర్లు ఉండగా 1.90 లక్షల మందికి ఫారాలు పంపిణీ చేశారని, మొత్తం ఎన్ని ఫారాలు పంపిణీ చేశారు, ఎన్ని తిరిగి వచ్చాయి అనే వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. డబుల్ ఎంట్రీ ఓట్లను, మరణించిన వారి పేర్లను తప్పకుండా తొలగించాలని, అదే సమయంలో ఎన్నో సంవత్సరాలుగా ఓటు వేస్తున్న నిజమైన భారతీయ పౌరుడు క్లిష్టమైన విధానాల కారణంగా ఇబ్బంది పడకూడదని అన్నారు. గ్రామీణ ప్రజలు, మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు సులభమైన విధానాన్ని అమలు చేయాలని, ఒకే చోట ధృవీకరణ పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు హక్కును రక్షించడం ఎంత ముఖ్యమో, ఆ హక్కును వినియోగించుకోవడం ప్రజలకు సులభంగా ఉండేలా చేయడం కూడా అంతే ముఖ్యమని, ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు అని దువ్వాడ శ్రీధర్ పేర్కొన్నారు. ఓటును కాపాడే వ్యవస్థ ప్రజలకు నమ్మకాన్ని, సౌలభ్యాన్ని, న్యాయాన్ని కల్పించాలని, అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని అన్నారు.

# హరితోదయతో పచ్చని భవిష్యత్తుకు శ్రీకారం

**శ్రీచైతన్య స్కూల్‌లో మొక్కలు నాటి విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం**
**స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా హరితోదయం**
**మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణపై అవగాహన**
**ప్రతి విద్యార్థి ఇంట్లోనూ మొక్కలు నాటాలని పిలుపు**

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం :**





విద్యతో పాటు ప్రకృతి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశంతో శ్రీకాకుళం జిల్లా మహాలక్ష్మీ నగర్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా 'హరితోదయం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద కూడా కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పచ్చదనం, పరిశుభ్రతతో కూడిన వాతావరణాన్ని భావితరాలకు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని రీజియన్ ఇన్‌చార్జి ఎస్. రామినాయుడు తెలిపారు. ప్రజోపయోగ కార్యక్రమాల నిర్వహణలో శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని ఉత్తరాంధ్ర జిల్లాల ఏజీఎం ఎం.వి. సురేష్ పేర్కొన్నారు. విద్యతో పాటు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోఆర్డినేటర్ ఎ. బాలరాజు అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. లోకనాథరావు, అకడమిక్ డీన్ పి. కోటేశ్వరరావు, అసోసియేట్ డీన్ పి. రాజా క్రాంతి కిరణ్, ఐపీఎల్ ఇన్‌చార్జి ఎ. హరిప్రసాదరావు, బి. జనార్ధన్, సి బ్యాచ్ ఇన్‌చార్జి టి. రామ్మోహన్, లీడ్ బ్యాచ్ ఇన్‌చార్జి కె. ఉత్తమకుమార్, ప్రైమరీ కోఆర్డినేటర్ కె. అప్పారావు, ప్రైమరీ ఇన్‌చార్జి ఎం. యామినీ పవిత్రతో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్యూమరేషన్ ఫారం బీఎల్‌వోకు అందజేస్తేనే ఓటు నమోదు

**అర్హులైన ఓటర్లు తప్పనిసరిగా ఫారాలు తిరిగి ఇవ్వాలి:**
**టీడీపీ అధికార ప్రతినిధి పీఎంజే బాబు**
**జూలై 4, 5 తేదీల్లో బీఎల్‌వోలు అందుబాటులో**
**ఫారాల డిజిటలైజేషన్‌కు ప్రత్యేక చర్యలు**
**బీఎల్‌ఏలు, పార్టీ శ్రేణులు సహకరించాలని పిలుపు**

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం:**



రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోకు తిరిగి అందజేస్తేనే ఓటరు వివరాలు ముసాయిదా జాబితాలో నమోదు అవుతాయని టీడీపీ అధికార ప్రతినిధి పీఎంజే బాబు తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జూలై 4, 5 తేదీల్లో (శని, ఆదివారాలు) ప్రతి బీఎల్‌వో తమ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్లకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ రెండు రోజుల పాటు ఓటర్ల నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించి, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారని వివరించారు. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి సమర్పించిన వారి వివరాలనే ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదు చేసే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఫారాలను పూర్తి చేసి బీఎల్‌వోలకు అందించాలని కోరారు. ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ప్రజలను చైతన్యపరిచి బీఎల్‌వోలకు సహకరించాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం మాత్రమే కారణంగా ఓటును తొలగించబోరని ఆయన స్పష్టం చేశారు. అందుబాటులో లేని వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలను మాత్రమే బీఎల్‌ఏల సమక్షంలో పరిశీలించి ధ్రువీకరించిన అనంతరం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో టీడీపీ శ్రేణులు, బీఎల్‌ఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా ముసాయిదా జాబితా నుంచి తప్పిపోకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని పీఎంజే బాబు విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలు నాణ్యమైన ఓటర్ల జాబితా తయారీలో అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

# మానవత్వమే "మహా సేవ"

**- నిస్సహాయ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత**

**(నవతరం గార - )**



మండలం, సతివాడ గ్రామానికి చెందిన అంబటి.నాగరాజు ప్రస్తుతం అధిక టీబీ వ్యాధితోపాటు గుండె సంబంధిత సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నారు. తండ్రి మరణించగా, ప్రస్తుతం వృద్ధ తల్లికి ప్రభుత్వం అందిస్తున్న జీవనభృతి పైనే కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటంతో, రోజూ తినడానికి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య చికిత్స, మందులు, పోషకాహారం అందించడానికి కూడా వారి వద్ద సరిపడా స్తోమత లేదు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రెడ్ క్రాస్ ప్రతినిధి చిన్నికృష్ణ ద్వారా విషయం తెలుసుకున్న, రెడ్ క్రాస్ ఎపిఆర్వో నంది.ఉమా శంకర్ అందించిన సమాచారం మేరకు, ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ అసోసియేట్ నల్ల.గౌతమి, బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో అందరం కలిసి మానవత్వంతో ముందుకు వచ్చి వారికి చేతనైన సహాయం అందిద్దామని, చిన్న సహాయం అయినా వారి జీవితంలో పెద్ద మార్పును తీసుకురాగలదని, దాతలు, సేవాభావం ఉన్న మిత్రులు ముందుకు వచ్చి అంబటి నాగరాజుకు అండగా నిలవాలని నల్ల.గౌతమి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్ల.గౌతమి కుటుంబ సభ్యులు, కుమార్తె సాయి అక్షర, కుమారుడు సాయి కీర్తన్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యవస్థ నిర్లక్ష్యానికి అన్నదాత బలి- డా. నిమ్మాన దాస్

**రైతు సంక్షేమం జాతీయ సమస్య**

**ఇచ్ఛాపురానికి వంశధార జలాలు కావాలి**



**నవతరం, జూలై 4:** దేశానికి అన్నం పెట్టే రైతు నేడు తీవ్ర సంక్షోభంలో ఉన్నాడు. పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న ఆదాయం, గిట్టుబాటు ధర లేమి, నకిలీ విత్తనాల బెడదతో అన్నదాత అల్లాడుతున్నాడని ఉద్దానం ప్రాంత సాగునీటి జలాల సాధన కమిటీ కన్వీనర్ డా. నిమ్మాన దాస్ అన్నారు. శుక్రవారం ఆయన నవతరం ప్రతినిధితో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోని లోపాలను ఎత్తి చూపారు. ఉద్దానం ప్రాంత అభివృద్ధికి వంశధార జలాలను ఇచ్ఛాపురానికి తరలించాలని డిమాండ్ చేశారు. ప్రశ్న: దేశంలో రైతు ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది? జవాబు: భారతదేశం వ్యవసాయాధారిత దేశం. దేశ జనాభాలో 45 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. దేశ ఆహార భద్రతకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. కానీ అన్నం పెట్టే రైతే నేడు తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలో ఉన్నాడు. పంట పండిస్తున్నాడు కానీ లాభం లేదు. ఉత్పత్తి పెరుగుతోంది కానీ ఆదాయం పెరగడం లేదు. ఇది రైతు సమస్య మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన జాతీయ సమస్య. ప్రశ్న: వ్యవసాయ ఖర్చులు, ఆదాయం మధ్య అంతరం ఏమిటి? జవాబు: గత రెండు దశాబ్దాల్లో వ్యవసాయ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, డీజిల్, కూలీల ధరలు పెరిగాయి. ఒక ఎకరం వరికి లక్ష రూపాయలు ఖర్చవుతోంది. కానీ అమ్మేటప్పుడు సరైన ధర రావడం లేదు. కోతల సమయంలో ధరలు పడిపోతున్నాయి. వినియోగదారుడు ఎక్కువ డబ్బు ఇస్తున్నా, రైతుకు చేరే వాటా చాలా తక్కువ. ఇది మార్కెట్ వ్యవస్థలోని పెద్ద లోపం. ప్రశ్న: గిట్టుబాటు ధరల సమస్యలేమిటి? జవాబు: ప్రభుత్వాలు మీరా ప్రకటించినా ప్రతి రైతుకు అందడం లేదు. కొనుగోలు కేంద్రాల కొరత, తేమ నిబంధనలు, చెల్లింపుల జాప్యం రైతును ఇబ్బంది పెడుతున్నాయి. మార్కెట్‌లో పారదర్శకత లేకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యం రైతు ఆదాయాన్ని తగ్గిస్తోంది. ప్రశ్న: నకిలీ విత్తనాలు, పంట బీమాపై మీ అభిప్రాయం? జవాబు: నకిలీ విత్తనాలు, పురుగుమందుల వల్ల ఏటా వేలాది మంది రైతులు నష్టపోతున్నారు. ఒకసారి నకిలీ విత్తనం వస్తే మొత్తం సీజన్ నాశనమవుతుంది. కోడ్ వ్యవస్థ తప్పనిసరి చేయాలి. పంట బీమా పరిహారం కూడా ఆలస్యంగా వస్తోంది. విపత్తు తర్వాత తక్షణ సాయం అందించేలా బీమా వ్యవస్థను ఆధునీకరించాలి. ప్రశ్న: రైతుల మానసిక పరిస్థితి? జవాబు: అప్పులు, పంట నష్టాలు, వాతావరణ అనిశ్చితి, నీటి కొరత వల్ల రైతుల్లో తీవ్ర ఒత్తిడి ఉంది. దీంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. రైతు సంక్షేమం అంటే ఆర్థిక సహాయం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్య మద్దతు కూడా అవసరం. ప్రశ్న: పరిష్కార మార్గాలు ఏమిటి? జవాబు: 1. పంట వైవిధ్యం, క్రాప్ క్యాలెండర్ అమలు. 2. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు - దళారుల ఆధిపత్యం తగ్గించడం. 3. ప్రతి మండలంలో గోదాములు, కోల్డ్ స్టోరేజీలు. 4. ఫామ్ పాండ్లు, డ్రిప్, సోలార్ పంపులు. 5. డిజిటల్ యాప్‌ల ద్వారా వాతావరణం, మార్కెట్ సమాచారం. ప్రశ్న: ఉద్దానం, ఇచ్ఛాపురం పరిస్థితి ఏమిటి? జవాబు: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గం. సాగునీరు లేక రైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. ఉద్దానం సస్యశ్యామలం కావాలంటే వంశధార జలాలను ఇచ్ఛాపురానికి తరలించాలి. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించాలి. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రధాన ఎజెండా. ప్రశ్న: చివరగా ఏమి చెప్పదల్చుకున్నారు? జవాబు: వ్యవసాయం ఒక ఆర్థిక వ్యవస్థ. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలి. రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. రైతు బలపడితేనే గ్రామీణ భారత్ బలపడుతుంది.

# 'మేరా యువ భారత్'తో యువతకు నూతన దిశ

**చినబడంలో అవగాహన కార్యక్రమం, రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష**

**యువజన క్లబ్‌ల ఏర్పాటుపై అవగాహన**

**యువత నైపుణ్యాల పెంపే లక్ష్యం**

**రక్తదాన శిబిరానికి విశేష స్పందన**



**నవతరం ప్రతినిధి పలాస:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబడం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మేరా యువ భారత్ నమోదు అవగాహన కార్యక్రమంతో పాటు ప్రభుత్వ రక్తదాన వాహనం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరై యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, యూత్ క్లబ్ డెవలప్‌మెంట్ క్యాంపెయిన్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సమాజ సేవలో భాగస్వాములను చేయడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత తమ సామర్థ్యాలను సమాజ అభివృద్ధికి వినియోగించాలని ఆమె పిలుపునిచ్చారు. మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి నమ్మల కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో యువతను క్లబ్‌లుగా సంఘటితం చేయడం, వారిలో నాయకత్వ లక్షణాలను వెలికితీయడం, డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, స్వయం ఉపాధిపై శిక్షణ అందించడం, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు, గ్రామాల పరిశుభ్రత వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను నిర్వాహకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, మండల అధ్యక్షుడు బడ్డ నాగరాజు, మండల కార్యదర్శి సప్ప నవీన్, చిన్ని, గాలి కృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, పాఠశాల యాజమాన్యం, జిల్లా స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆ నలుగురే అసలైన ఆస్తి..?



డబ్బు...
ఇటుకల్ని పేర్చి
ఇంద్రభవనాలు కడుతుంది...
కానీ...గాయపడిన
హృదయాలకు మందుగా మారలేదు...

డబ్బు...
గడియారపు ముళ్లను
గిర్రున తిప్పుతుంది...కానీ
గడిచిపోయిన క్షణాన్ని గెలుచుకోలేదు...

డబ్బు...
అందమైన పుస్తకాలతో
అలమారల్ని అలంకరిస్తుంది.
కానీ అక్షరాల వెలుగును
అరువు తెచ్చుకోలేదు...

డబ్బు...
పదవుల్ని పేరు ప్రతిష్టలను
కీర్తి కిరీటాలను అందిస్తుంది...
కానీ ప్రజల గుండెల్లో
గౌరవపు సింహాసనాన్ని నిర్మించలేదు

డబ్బు...
రక్తపు బొట్టును రప్పిస్తుంది...
కానీ జీవితపు శ్వాసను సృష్టించలేదు

డబ్బు...
పట్టు పరుపులు పరుస్తుంది...కానీ
కనురెప్పలకు కమ్మని నిద్రనివ్వలేదు

డబ్బు...
జేబులను నింపితే.
ప్రేమ, జ్ఞానం, మానవత్వం
జీవితాలను నింపుతాయి...

డబ్బు...
ఒక సాధనమే సర్వస్వం కాదు...
మనిషికి కోట్ల ఆస్తి ఉండొచ్చు
కానీ
ఆ నలుగురే మనిషికి అసలైన
ఆస్తి...

మనిషిని నిలబెట్టేది
నోట్లకట్టలు కాదు నమ్మకాల
వంతెనలే

అందుకే...డబ్బు...
జేబులో ఉండాలి...తలలో కాదు.
చేతిలో ఉండాలి...హృదయంలో
కాదు

రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేత విద్యార్థులకు అభినందనలు




**నవతరం టెక్కలి.** ఇటీవలశ్రీకాకుళం జిల్లాలో ఫిట్ ఇన్ శ్రీకాకుళం ( ఎంపీ కప్ ) పేరుతో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సంతబొమ్మాళి మండలం, నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్-16 విభాగంలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి ఛాంపియన్లుగా నిలిచారనీ కళాశాల ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు మాట్లాడుతూ, మన కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో రాష్ట్ర జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు తల్లిదండ్రులకు మరియు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే కళాశాల అధ్యాపక బృందం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. తిరుమలరావు , సీనియర్ అధ్యాపకులు ఎం. నారాయణరావు, ఆర్. జనార్ధన్‌రావు, ఎల్.ఎల్.ఎన్. స్వామి, పి. అమర్నాథ్, ఐ. జగదీష్, సీహెచ్. వసంతరావు లు విజేత విద్యార్థులను అభినందించి, వారి క్రీడా ప్రతిభకు ప్రశంసలు తెలుపుతూ కళాశాల కుటుంబశీ తరఫున హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కుటుంబం తరఫున విజేత విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

# యువతకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు

**రాజాం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

**చిత్రపటానికి పూలమాల వేసి నివాళి**

**అల్లూరి ఆశయాలను యువత కొనసాగించాలి**

**భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టడం గర్వకారణం**



**నవతరం ప్రతినిధి రాజాం:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని రాజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జె. ఆనందరావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం రాజాం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో గిరిజనులను ఉద్యమం వైపు నడిపించి బ్రిటిష్ పాలకులను ఎదుర్కొన్న మహా వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అతి చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పింకీ చైతన్య కుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం భారత ప్రభుత్వం ఆయనకు అందించిన గొప్ప నివాళి అని పేర్కొన్నారు. నేటి యువతలో చాలామంది వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులకు దూరంగా ఉండి అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములై దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఈఓ దుర్గారావు, ఏవో లోకేశ్‌రావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# మావిగన్ అంటే కూటమి నేతల్లో భయం

## -వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని



**అమరావతి నవతరం :** అమరావతి పేరుతో చంద్రబాబు అంతులేని అవినీతి, మోయలేని అప్పులు చేస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. మావిగన్ పేరు చెప్పగానే కూటమి నేతల్లో భయం చుట్టుకుంటుందని విమర్శించారు. వైసీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని ఎప్పుడు పూర్తి అవుతుందో , ఎన్ని కోట్లు ఖర్చు పెడుతున్నారో సమాధానం చెప్పడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి రూ. 50 వేల కోట్లు అప్పులు తెచ్చి ఆఫీసులు కడుతున్నారని పేర్కొన్నారు. రైతుల జీవితాలతో చంద్రబాబు ఆటలాడు తున్నారని మండిపడ్డారు. అమరావతి రైతులను కలిసేందుకు వెళ్తే దాడులు చేస్తున్నారని అన్నారు. కచ్చితంగా అమరావతి రైతుల వద్దకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# మలబార్ గోల్డ్‌లో ఘనంగా డైమండ్ జ్యువెలరీ షో ప్రారంభం

**వైద్యురాలు డాక్టర్ స్వాతి వాసంతి**
**ప్రారంభించిన ప్రత్యేక ప్రదర్శన**
**జూలై 8 వరకు ప్రత్యేక డైమండ్ జ్యువెలరీ షో**
**ఐజీఐ ధ్రువీకరణతో ఆకర్షణీయమైన ఆభరణాలు**
**జీవితకాల ఉచిత నిర్వహణ, 100% బైబ్యాక్,**
**ఏడాది ఉచిత బీమా**





**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం :** శ్రీకాకుళంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో శనివారం డైమండ్ జ్యువెలరీ షో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ స్వాతి వాసంతి ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలన చేసి ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి వాసంతి మాట్లాడుతూ మలబార్ గోల్డ్‌తో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని, ఈ ప్రత్యేక డైమండ్ జ్యువెలరీ షోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఐజీఐ ధ్రువీకరణ కలిగిన డైమండ్ ఆభరణాలతో పాటు జీవితకాల ఉచిత నిర్వహణ, 100 శాతం బైబ్యాక్ గ్యారెంటీ, ఏడాది పాటు ఉచిత బీమా వంటి వినియోగదారులకు ప్రయోజనకరమైన సౌకర్యాలను మలబార్ అందిస్తోందని తెలిపారు. ఆధునిక డిజైన్లతో కూడిన విభిన్న రకాల డైమండ్ ఆభరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని, మహిళలు తప్పకుండా ఒకసారి సందర్శించాలని సూచించారు. స్టోర్ హెడ్ వసీఫ్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక డైమండ్ జ్యువెలరీ షో ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. మెట్రో నగరాల్లో మాత్రమే లభించే అత్యాధునిక డిజైన్ల డైమండ్ ఆభరణాలను శ్రీకాకుళం వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచామని, ఆకర్షణీయమైన ధరలకు కొనుగోలు చేసే అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై డైమండ్ ఆభరణాలను ఆసక్తిగా వీక్షించారు. మార్కెటింగ్ మేనేజర్ రాజు, డిప్యూటీ మేనేజర్ రాజశేఖర్, షోరూం సిబ్బంది, వినియోగదారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చైతన్యపు జ్వాలాస్ఫూర్తి అల్లూరి

**గాంధీ మందిరంలో జయంతి వేడుకలు**



**శ్రీకాకుళం :** భారత స్వాతంత్ర్య పోరాటంలో చైతన్యపు జ్వాలా స్ఫూర్తిని రగిలించిన ఘనత అల్లూరి సీతారామరాజుదేనని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చౌదరి రాధాకృష్ణ అన్నారు. శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో అల్లూరి 129 జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విగ్రహదాత జామి హరీష్‌తో పాటు గాంధీ మందిర ప్రతినిధులు పైడి హరనాధరావు, జి.నాగేశ్వరరావు, శాస్త్రి తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్య పోరాటాన్ని సాయుధ పోరాటంగా మలిచిన కీర్తి అల్లూరిదన్నారు. బ్రిటిష్ రాజ్యానికి ఎదురొడ్డి నిప్పు కణికల్లాంటి మాటలతో ఒక వైపు, ప్రజా చైతన్యాన్ని మరో వైపు రగిలిస్తూ సీతారామరాజు పోరాటాలకు దిక్సూచీగా నిలిచారన్నారు. అల్లూరి అందించిన స్ఫూర్తి పోరాట యోధులందరికీ శాశ్వతబాటగా నేటికీ కొనియాడబడుతుండడం గొప్ప విషయమన్నారు. అనంతరం అవధాన పండితులు పైడి హరనాధరావు గేయాన్ని ఆలపించారు. విగ్రహదాత జామి హరీష్‌ని గాంధీ మందిర ప్రతినిధులు సత్కరించారు.

# అరుణోదయ నాగన్నకు జోహార్లు

## భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ ధర్మం

- ఇస్కఫ్ ' మైత్రి ' పత్రిక ఆవిష్కరణసభలో వక్తలు



**శ్రీకాకుళం, జూలై 4 :** విభిన్న కులాలు,మతాలు, ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల మన దేశం ఐక్యంగా ఉండడానికి కారణం, భిన్నత్వంలో ఏకత్వమేనని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు అధ్యక్షతన స్థానిక విశాలాంధ్ర భవన్ లో శనివారం ఉదయం, సంస్థ ప్రత్యేక సంచిక ' మైత్రి ' ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఇస్కఫ్ సంస్థ చరిత్రను వివరించారు. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడటంలో సంస్థ కృషిని గుర్తు చేశారు. ఇటువంటి సంస్థలో సభ్యత్వం తీసుకోవడమే గొప్ప గౌరవం అన్నారు. ప్రత్యేక అతిథి, హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్వీడీ మురళి మాట్లాడుతూ, ఒక వ్యక్తి గాని, సంస్థ గాని ఎదగడానికి నిబద్ధత, కృషి, పట్టుదల ఉండాలని, అంతకుమించి ఒక ఉన్నతమైన లక్ష్యం కూడా నిర్ణయించుకోవాలని అన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షులు, కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ, దేశం ఐక్యత కోసం తపనపడే సంస్థల్లో ఇస్కఫ్ అగ్రస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా సమితి ఉపాధ్యక్షులు సీపాన రామారావు మాట్లాడుతూ ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులు ,జిల్లా నుండి సహకరించిన వారికి అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు మానెం సన్యాసిరావు మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ప్రముఖ తెలుగు సినీ గాయకులు పొట్నూరు రమేష్ మాట్లాడుతూ సమాజానికి ఉన్నతమైన వ్యక్తులను పరిచయం చేసిన గొప్ప వ్యక్తి సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు గా పేర్కొన్నారు. సంఘం అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. జిల్లా సమితి సభ్యులు దిబ్బ ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లా సమితి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ఆనందంగా వుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఇస్కఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఉపాధ్యక్షుడిగా జిల్లా వాసి కణితి నవీన్

- రాష్ట్ర ఆర్ అండ్ బీ (బిల్డింగ్స్) చీఫ్ ఇంజనీర్ గా ఉన్న నవీన్



**శ్రీకాకుళం :** కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఉపాధ్యక్ష పదవికి శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్కిటెక్చర్ విభాగం చైర్మన్ ఆర్కిటెక్, చీఫ్ ఇంజనీర్ ( బిల్డింగ్స్ ) కణితి నవీన్ విజయం సాధించారు. విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రేయామ్స్ మోహన్ నవీన్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనేది దేశవ్యాప్తంగా ఆర్కిటెక్ట్ ల రిజిస్ట్రేషన్, ఆర్కిటెక్చర్ విద్యా ప్రమాణాల నిర్ధారణ, వృత్తి నైతిక విలువలు పరిరక్షణకు బాధ్యత వహించే జాతీయస్థాయి అత్యున్నత సంస్థ. ఈ కౌన్సిల్ కు ఉపాధ్యక్షుడిగా జిల్లా వ్యక్తి ఎన్నిక కావడం గర్వకారణం. నవీన్ ఏడాది కాలంగా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ రంగంలో చీఫ్ ఇంజనీర్ గా సుదీర్ఘ అనుభవం, క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన గల కణితి నవీన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆర్కిటెక్ రంగానికి శుభ పరిణామమని పలువురు ప్రముఖులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యువ ఆర్కిటెక్ట్ లకు, ఆర్కిటెక్చర్ విద్యార్థులకు నవీన్ నాయకత్వం నూతన విషయాన్ని చేస్తుందని వాస్తు శిల్ప నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంలో సుస్థిరత, ఆధునిక వాస్తు శిల్ప సమ్మేళనం , గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ల అమలులో నవీన్ కు ఉన్న దార్శనికత జాతీయస్థాయిలో కౌన్సిల్ విధానాల రూపకల్పనకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తమవుతుంది. శ్రీకాకుళం జిల్లా వాసి ఇంతటి స్తాయి కి వెళ్లడం జిల్లాకు గర్వకారణం అని జిల్లా వాసులు గర్వపడుతున్నారు.

## అరుణోదయ నాగన్నకు జోహార్లు

- ఉద్దానంతో విడదీయరాని బంధం

విప్లవ గాయకుడు



కామ్రేడ్ అరుణోదయ నాగన్న అమర్ రహే!
ప్రజా కళలు వర్ధిల్లాలి
ప్రజా సంస్కృతి వర్ధిల్లాలి

వంకల మాధవరావు
సహాయ కార్యదర్శి, సిపిఐ(ఎంఎల్)
న్యూ డెమొక్రసీ, శ్రీకాకుళం జిల్లా

ప్రజల గుండె చప్పుడే పాటగా మారిన అరుదైన ప్రజా కళాకారుల్లో కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఒకరు. ఆయన మరణం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు; ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి, విప్లవోద్యమానికి తీరని లోటు. ముఖ్యంగా శ్రీకాకుళంఉద్దానం ప్రాంత ప్రజలకు నాగన్న కుటుంబ సభ్యుడిలాంటి వ్యక్తి. ఆయన జ్ఞాపకాలు ఒక కళాకారుడివి మాత్రమే కాదు; నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన ప్రజా ఉద్యమాల చరిత్రతో ముడిపడి ఉన్న పోరాట స్మృతులు ఎన్నో ఉన్నాయి. ఎమర్జెన్సీ అనంతరం శ్రీకాకుళం ఉద్యమంపై కొనసాగిన నిర్బంధాల మధ్య ప్రజలకు కొంత ఊరట లభించిన కాలంలో, పార్టీ నిర్ణయంతో వజ్రపుకొత్తూరు మండలం మర్రిపాడులో అమరవీరుల స్మారక స్తూపం నిర్మించబడింది. కామ్రేడ్ కుమార్ అన్న శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గాను, కామ్రేడ్ పైల వాసుదేవరావు రాష్ట్ర కార్యదర్శి గాను ఉన్న కాలంలో మురిపింటి వల్లభ రావు ఇచ్చిన స్థలంలో అమరవీరుల స్థూపం నిర్మించబడింది. ఆ స్తూపం ఆవిష్కరణతో ప్రారంభమైన అమరవీరుల సభల్లో నాగన్న గానం ఒక విడదీయరాని భాగమైంది. ఆయన పాడిన ప్రతి పాట శ్రీకాకుళం అమరవీరుల త్యాగాలను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపింది. సభల కరపత్రంలో "అరుణోదయ నాగన్న గానం" అని ముద్రిస్తే చాలు, వందలాది మంది సభలకు తరలివచ్చేవారు. " "అన్న అమరుడు రా""వీరగాథలు పాడరా" వంటి గీతాలు వినిపించినప్పుడు వేలాది మంది నిశ్శబ్దంగా ఆలకించి, చివరికి ఉద్యమ సంకల్పంతో ఊగిపోయేవారు. పాటను వినోదంగా కాకుండా పోరాట ఆయుధంగా మార్చిన గాయకుడు నాగన్న. 1980వ దశకం నుంచి 2023 వరకు ఉద్దానం నేలపై జరిగిన అనేక సభలు, అమరవీరుల సంస్మరణలు, రైతుకూలీ ఉద్యమాలు, ఆదివాసీ పోరాటాలు, కులవివక్ష వ్యతిరేక కార్యక్రమాలు, ప్రజాస్వామ్య ఉద్యమాలుఏ వేదిక చూసినా నాగన్న గళం మారుమోగేది. మర్రిపాడు, మామిడిపల్లి, బొడ్డపాడు, నీలావతి వంటి గ్రామాలు ఆయన గానంతో ఎన్నోసార్లు చైతన్యభరితమయ్యాయి. కామ్రేడ్ కానూరి రచించిన శ్రీకాకుళం ఉద్యమ గానం బుర్రకథను అమరుడు రామారావుతో కలిసి ప్రజల్లోకి తీసుకెళ్లిన నాగన్న, విప్లవ ప్రచార సాధనంగా మలిచారు. మామిడిపల్లిలో జరిగిన ఆదర్శ వివాహాల్లో పాల్గొని కులవివక్ష, మూఢనమ్మకాలు, బ్రాహ్మణీయ ఆధిపత్యంపై ఆయన ఆలపించిన పాటలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంచాయి. అమరుడు కామ్రేడ్ రామ నరసయ్య పై ఆయన ఆలపించిన గీతం ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా మారుమోగింది. ఉద్దానం ప్రాంతంలోని అనేక ఇళ్లలో టేప్ రికార్డర్లలో ఆ పాట నిరంతరం వినిపించేది. ప్రజా కళ ప్రజల ఇళ్లలో స్థానం సంపాదించుకోవడం అరుదైన విషయం; నాగన్న ఆ అరుదైన గౌరవాన్ని పొందారు. 2006లో మామిడిపల్లిలో జరిగిన అరుణోదయ జిల్లా శిక్షణా తరగతుల్లో మూడు రోజులపాటు కార్యకర్తలతో కలిసి గడిపిన ఆయన, అనంతరం బొడ్డపాడులో జరిగిన సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభలో ప్రజలను తన గానంతో ఉర్రూతలూగించారు. కామ్రేడ్ పైలా వాసుదేవరావు అమరత్వం చెందిన తర్వాత ఆయనపై రూపొందించిన గీతాలు,సి. డి లు వేలాది మంది హృదయాలను కదిలించాయి. "కామ్రేడా ఓ పైలాడ కన్నుమూసావా అన్నాడ" అంటూ ఆయన ఆలపించిన గానం ఇప్పటికీ ప్రజల చెవుల్లో మారుమోగుతోంది. ఖమ్మం జిల్లా తిరుమలపాలెం మండలం రాజారాం గ్రామంలో జన్మించిన నాగన్న, తన జీవితం మొత్తాన్ని ప్రజలకే అంకితం చేశారు. పేదరికం ఆయనను చదువుకు దూరం చేసిన పట్టుదలతో అక్షరాలను ఏర్చికూర్చి అనేక పాటలకు పురుడు పో. సమాజంలో అనేక ఆన్యవర్గ ధోరణులు తలెత్తిన వాటన్నింటినీ చైతన్యంతో ఎదుర్కొన్నాడు. ఆయన ప్రయాణం చివరి శ్వాస వరకు ప్రజల పక్షానే సాగింది. అధికారాల కోసం, అవార్డుల కోసం, కీర్తి కోసం ఆయన ఎప్పుడూ కళను ఉపయోగించలేదు. పాలకులు కళాకారులను తమవైపు తిప్పుకునేందుకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ఈ కాలంలో కూడా ఆయన తన గళాన్ని ప్రజల పక్షాన నిలబెట్టారు. భువనేశ్వర్‌లో జరిగిన అఖిల భారత ఆదివాసీ సదస్సు నుంచి విశాఖలో జరిగిన అరుణోదయ మహాసభల వరకు, ఆదివాసీలకు కోలాటం నేర్పించడం నుంచి ప్రజా కళలను కళాత్మకంగా తీర్చిదిద్దడం వరకు ఆయన చేసిన కృషి అపూర్వం. ఉద్యమం ఉన్న చోట నాగన్న ఉండేవారు; నాగన్న ఉన్న చోట ప్రజల్లో కొత్త ఉత్సాహం కనిపించేది. మలియాపుట్టిలో కుల నిర్మూలన వారోత్సవాల్లో ఆయన ఆలపించిన "కుల రక్కసి కోరలు సాచిందిడ" గీతం విన్న దళిత, ఆదివాసీ యువత కళ్లలో కన్నీరు, గుండెల్లో ఆగ్రహం ఒకేసారి కనిపించాయి. అదే నాగన్న గాన శక్తి. శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ విప్లవ వారసత్వం, గోదావరి లోయ ప్రతిఘటన, రైతుకూలీ ఉద్యమాలు, దళితఆదివాసీ పోరాటాలుఇవన్నింటినీ తన గానంలో జీవం పోసిన గళం నేడు మూగబోయింది. కానీ ఆయన పాడిన పాటలు మూగబోవు. ప్రజల పోరాటాలు ఉన్నంతకాలం నాగన్న గానం జీవిస్తుంది. నేడు దేశంలో ఫాసిస్టు ధోరణులు కళలపై, గళాలపై సంకెళ్లు వేయాలని ప్రయత్నిస్తున్న వేళ, నాగన్న చూపిన మార్గం మరింత ప్రాసంగికమైంది. ప్రజల పక్షాన నిలిచే సంస్కృతి, ప్రజలను చైతన్యపరిచే కళ, అన్యాయాన్ని ప్రశ్నించే గళం ఎంత అవసరమో ఆయన జీవితం మనకు గుర్తుచేస్తుంది. అరుణోదయ నాగన్న శరీరంగా మన మధ్య లేకపోయినా, ఆయన స్వరం ఉద్దానం గాలిలో వినిపిస్తూనే ఉంటుంది. ప్రతి అమరవీరుల సభలో, ప్రతి ప్రజా ఉద్యమంలో, ప్రతి విప్లవ గీతంలో ఆయన చిరంజీవిగానే ఉంటారు. కామ్రేడ్ నాగన్న సహచరి లక్ష్మక్క, కుమారుడు అజయ్ కష్టాలు ఎదుర్కొంటూ నాగన్న ఆశయాలకు అండగా నిలబడడం చిన్న విషయం కాదు. నాగన్నను అనారోగ్య రోజుల్లో చిన్న బిడ్డల సాకి ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. వారికి ప్రత్యేక అభినందనలు. ఈ సందర్భంగా నాగన్న కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తున్నాను.

## బెస్ట్ పెర్ఫార్మర్‌గా ఏడి చంద్రారావుకు జాతీయ స్థాయి గుర్తింపు

**ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో విశిష్ట సేవలకు సత్కారం**

**హెచ్‌ఎఫ్‌ఆర్, హెచ్‌పీఆర్ నమోదులో అత్యుత్తమ ప్రతిభ**

**శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు**

**నేషనల్ హెల్త్ అథారిటీ డైరెక్టర్ సమక్షంలో సత్కారం**




national health authority

CERTIFICATE
OF APPRECIATION
presented to

Shri. Dr. M. CHANDRA RAO In the category of AD. DRUG CONTROL ADMINISTRATION
In recognition of outstanding contribution towards the successful implementation of the **Ayushman Bharat Digital Mission (ABDM)** and promoting the adoption of digital health services in Andhra Pradesh.

**Presented on the occasion of**
Launch of the Ayushman Bharat Digital Mission (ABDM) Model District & Facilities Initiative
3rd July 2026, Srikakulam

In presence of
Director
National Health Authority (NHA)

**Department of Health, Medical & Family Welfare**
Government of Andhra Pradesh

Collector & District Magistrate
Srikakulam

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం:**

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో విశిష్ట పనితీరు కనబరిచినందుకు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ శ్రీకాకుళం సహాయ సంచాలకుడు (ఏడి) ఎం. చంద్రారావుకు జాతీయ స్థాయిలో 'బెస్ట్ పెర్ఫార్మర్' గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలను డిజిటల్ విధానంలో ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా డాక్టర్ సంప్రదింపుల నుంచి ల్యాబ్ పరీక్షలు, మందుల ప్రిస్క్రిప్షన్, ఔషధాల పంపిణీ, వైద్య రికార్డుల భద్రపరచడం, చెల్లింపులు తదితర సేవలను డిజిటల్ రూపంలో అందిస్తూ రోగులకు వేగవంతమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా మోడల్ జిల్లాగా నిలిచింది. శ్రీకాకుళంలోని ఎస్వీఎస్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఏడి చంద్రారావును ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని రిటైల్ మెడికల్ షాపులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఫార్మసీలకు సంబంధించిన హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను అత్యల్ప సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ కృషిని గుర్తించిన నేషనల్ హెల్త్ అథారిటీ ఆయనకు 'బెస్ట్ పెర్ఫార్మర్' గుర్తింపును ప్రదానం చేసింది. ఈ సత్కార కార్యక్రమంలో నేషనల్ హెల్త్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ పీయూష్ సింగ్లా, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని చంద్రారావును అభినందించారు. ఈ సందర్భంగా ఏడి చంద్రారావు మాట్లాడుతూ, ఈ గౌరవం తన ఒక్కరికే కాకుండా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ సిబ్బంది, ట్రేడ్ సంఘాల ప్రతినిధులు, మెడికల్ షాపుల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఫార్మసిస్టులందరికీ దక్కిన గుర్తింపని అన్నారు. అందరి సమిష్టి కృషి, సమన్వయంతోనే రాష్ట్రంలోనే అత్యుత్తమ పనితీరు కనబర్చడం సాధ్యమైందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ విజయవంతమైన అమలుతో ప్రజలకు మరింత వేగవంతమైన, సులభమైన, పారదర్శకమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

Printed **SIRIGIRI VARADARAJU,** and published by **SIRIGIRI VARADARAJU,** On behalf of **SIRIGIRI VARADARAJU**,and printed at Kranthi publications, D.NO.2-504/1 **Aditya Nagar** colony Arasavilli Srikakulam dist, **ANDHRA PRADESH STATE** 532 401 **Published at** Kranthi publications D.NO.2-504/1 Srikakulam dist, ANDHRAPRADESH STATE 532 401. Editer : **SIRIGIRI VARADARAJU** Email: navatharamraju @gmail.com **CELL : 9959007255, 8340844777**